కవితా కౌముది

# పాపాయి

పవన్ కుమార్ గజవల్లి

కాలిపై కాలు, నోటిలో వ్రేలు
పద్మనాభునికి ప్రతిగా, భువన యోగిగా
ప్రసవాబ్ధినీది వచ్చిన పరలోకి
తన ఇంటికి కొంగ్రొత్త చిన్న కాపు
బొటనవ్రేలే నీ ప్రపంచమంటే నవ్వొచ్చింది,
ఇంత చిన్నదా నీ ప్రపంచమని
బొటనవ్రేలితో ప్రపంచాన్నానదిస్తావంటే నమ్మలేక పోయాను
చూసినపుడనిపించింది అది ముమ్మాటికి నిజమని,
అది మాత్రమే నిజమని
కస్తూరి తిలకం, లలాట ఫలకం
వక్షస్థల కౌస్తుభం, నాసాగ్రపు మౌక్తికం
చేతుల కంకణాలు, కాళ్ళ కడియాలు
బంగారు మొలత్రాడు, వెండి తాయత్తు
పాల బుగ్గలు, పసిడి నవ్వులు
ముక్కు పచ్చలు, లేలేత ముంగురులు
మౌన ముద్రలు, ముద్దు మోములు
గిలకతో ముచ్చట్లు, గాలితో గానాలు
అమ్మ కోసం ఏడుపులు, ఆకలై కేకలు
ఎంగిలి పాల పెదవులు, బోసి నోటి నవ్వులు
అరమోడ్పు కన్నులు, విల్లంటి కనుబొమలు
ఊయలలో వూగిసలు, అమ్మనోట జోజోలు
అమ్మ చేతి ముద్దలు, చప్పరించు పెదవులు
అమ్మమ్మ కాళ్ళపై తలంటు స్నానాలు, వీపుపై దెబ్బలు
కాళ్ళేతుల విరుపులు, సాంబ్రాణి ధూపాలు
బుగ్గపై చుక్కలు, కళ్ళకేమో కాటుకలు

అమ్మలక్కల చూపులు, ఊయల చుట్టూ గుంపులు
పలకరింపులు, చక్కిలిగింతలు
వెక్కిరింతలు, చిలిపి చేష్టలు
లెక్కలేని ముద్దులు, బుగ్గపై గిల్లుళ్ళు

చిత్రమైన శబ్దాలు, అర్థం కాని సైగలు
చిరాకు చిన్ని చొక్కాలు, గుచ్చుకొనే గుండీలు
బాల మిత్రుల చప్పట్లు, ఈల లేసే బొమ్మలు
మరువగలరా నీ అందం ఎవరైనా? ఎప్పుడైనా? ఎక్కడైనా?
నీ మాత్రు క్షీర మధురామ్రుతాన్నం, మా
మ్రుష్టాన్నభోజనాలనెక్కిరిస్తుంది
నీ సామీప్య పాల సుగంధం ముందు కస్తూరి పరిమళాలు
విస్తుపోతాయి
నీ కంటి కమలాలను చూసి పారిజాతం నివ్వెర పోతుంది ...
అవాక్కవుతుంది
నీ మెలి తిరిగిన పసి కండలు వస్తాదుల ఆరు మడతలు
అమ్మ పాలిట నాలింపక నిద్దురాడని నీ రాజసం
ఉయ్యాల దిగనట్టి నీ భాగ్యోన్నతత్వం
పరికించి చూసినపుడనిపిస్తుంది నీవు మా వసుపతివని
మా పరపతివని మా కులపతివని
మాయలేని నీ నగుమోము పసుపతిని తలపిస్తుంది
అమ్మనడుగు నాన్ననడుగు నీ క్షణాలను వదలొద్దని
ఈ జ్ఞాపకాలను దాచమని ఇవి మరెన్నడూ తిరిగి రావని
శహభాష్... పాపాయి ... శహభాష్
పికాసో నిను గాంచే గ్రీకు శిల్పం చెక్కుంటాడు
బాపు గారు నిను చూసే బుడుగును గీసుంటారు
ప్రపంచాస్వాదనకు నీకు బొటనవ్రేలు, మాకు స్మార్ట్ ఫోను ... భలే!
పాపాయి భలే! భలే!
అపుడెపుడో నాళం వారి ఆటవెలదిలో ఆటలు,
జాషువా గారి సీసం లో లాస్యాలు
ఛందోరహిత ఆధునిక కైత గా ఇపుడు నా దగ్గర దర్జాలు
పాపాయి జయము జయము నీకు సదా విజయము
నీ విజయము సదా నిజము
జో అచ్యుతానంద జో జో ముకుందా
రార పరమానంద రామ గోవిందా
జో... జో... జో... జో... జో.. ★★★

# మనమింతే

అల్లూరి గౌరీలక్ష్మి

పక్కనున్నవాడికి సౌకర్యం ఇచ్చేసి
ఇబ్బంది మనం పడిపోతుంటాం
తప్పుచేసిన వాణ్ని సారీ చెప్పనివ్వం
మనదే తప్పని పైన వేసేసుకుంటాం

తోటివాడి చెప్పుల్లో వద్దన్నా కాళ్ళు పెట్టేసి
వాడి తరఫున మనం బాధ పడిపోతాం
అడక్కుండానే ఆ కష్టాలకి నివారణ చూపిస్తాం
నేనున్నాగా, అని భుజం ఇచ్చేసి ఓదారుస్తాం

మనకి ఆపదొచ్చినవేళ ఎవరూ తలతిప్పనపుడు
వేలు కొరుక్కుని వేదాంతం పలించుకుంటాం
బాకీపడి మొహం చాటేసిన వాణ్నిపట్టేసుకుని
రుణాన్ని మాఫీ చేసి వీపు తట్టేసి వస్తుంటాం

-2-

మన అవసరానికి ఒక్కరూ కనబడకపోయినా
అది పూర్వజన్మ ప్రారబ్ధమని సరిపెట్టేసుకుంటాం
బతక నేర్వని వాళ్లమని ఎవరో దయ చూపినపుడు
అంత మంచివాళ్ళం కాదని నచ్చచెప్పి ఒప్పిస్తాం

పొత్తిళ్ళ నుంచీ మర్యాదా రాముళ్లు గా మనల్ని చెక్కిన బొమ్మ
స్వర్గానికి పోతూ, ఎలా బతుకుతారో! అంటూ కన్నీరైనపుడు
తెలిసింది రహస్యం, మనం మాత్రమే ఇలా ఎందుకున్నామో!
ఇప్పుడు మొదలు పెట్టి, మనల్ని కొత్తగా చెక్కుకోలేం కదా !!

★★★

# కల

డా.రూపేష్ ఆదిమూలం

ఓ ఎడారిలో ,
తడి ఆరని తలపులతో ,
తనివి తీరని దాహంతో ,
గమ్యమెరుగని బాటలో ,
నీటి జాడ ఉంటుందని ,
నడుస్తున్న బాటసారి ,
కళ్లు పైకి చూస్తాయి ,
కాళ్లు నేలపైనే నడుస్తాయి .!
చినుకు ఒకటి పడుతుందని ,
తన దాహం కొంతైనా తీరునని,
అలుపెరగక సాగుతుంది ,
తప్పుల తడకల ఆ వడి వడి నడక .!
తూలిపడిన ప్రతి సారి ,
కళ్లు నేల కేసి చూస్తాయి .
కాళ్లు పైకి తిరిగి లేస్తాయి .
లేచిన ప్రతిసారి కాళ్లు నేలపైనే ఉంటాయి .
కళ్లు పైకే చూస్తాయి . !
అంబరాన్న అంటమని,
ఆశ ఊసులుగా చెపుతుంటే ,
కోరికలే గుర్రాలై తలపుల మేఘాల్లో ,
దౌడు తీస్తూ ఉరుకుతాయి .!
ఊహలు రెక్కలు తొడిగి,
నింగికి ఎత్తున ఎగిసి ,
తలపులకందనంత ఎత్తులో ,
ఎగురుతూ స్వేచ్ఛగా ,
ఎక్కడికో పయనిస్తుంటాయి .!
అనంతమైన విశ్వంలో ,
ఆ ఆకాశమే ఓ హద్దుగా
తలపుల మేఘాలు కదిలిపోతుంటాయి .
గమ్యమెరుగని చోటుకు ,
త్వర త్వరగా చేరాలని ,
మనసు ఉరకలేస్తుంది .
నేల విడిచి , వళ్లు మరచి
నింగినందుకుందామని ,
కాళ్లు పైకి ఎగురుతాయి.
ఉరుముల , మెరపుల జడివాన
వెల్లువలా ముంచుకొచ్చి
తలపుల మేఘాలు చెదిరిపోతుంటాయి .
పెంచుకున్న ఆశలన్నీ
కరిగి నీరై ఆవిరై పోతాయి.
నిరాశ నిండిన గుండెపై ,
పిడుగు పడిన తరుణంలో
కళ్లు బైర్లు కమ్ముతాయి .
కాళ్లు విరిగి తిరిగి నేలపై పడతాయి .
క్షణకాలం నొప్పితో అమ్మా అని అరుస్తాయి .
కుంటుతున్న కాళ్లు మళ్లీ పైకి లేస్తాయి .
కళ్లు పైకి చూస్తాయి .
కళ్లముందు మబ్బుతెరలు ,
ఒక్కొక్కటి వీడిపోయి ,
మండుతున్న సూర్యుడు ,
నిప్పులాంటి నిజంలాగ ,
కళ్లముందు కనపడితే ,
చూడలేని ఆ కళ్లు ,
కనురెప్పల చాటున ,
సేదతీరుతుంటాయి .
వేడిగా తాకుతున్న ,
చుర చుర మని గుచ్చుతున్న ,
పొద్దుటెండ పైబడితే ,
కల చెదిరి పోతుంది .!
మూసిన కళ్లు తెరుచు కుంటాయి .
ఇది కలే కదా అనుకుంటు రోజంతా గడుస్తుంది .
నిశిరాత్రి వేళ ఆశ చచ్చిపోతుంది ,
కలిగిపోయె కలలో తిరిగి మొగ్గ తొడుగుతుంది.
పువ్వులా రాలిపోయి ఉదయాన్నే ఉదయిస్తుంది
బతుకు ఇలా తెల్లారిపోతోంది .
ఇదే కదా జనన మరణ చక్రం!
ఆ పరమపద సోపాన పటం !
అసలు ఇది కలా , జీవితానికి ఇది ఓ నకలా ?
ఆ అలుపెరుగని బాటసారి,
ఈ దాహం తీరనిది.
నిజం కాని కలే ఇది . ★★★

## ప్రవాహ గీతం
## డా.మక్కెన శ్రీను

పోరాటం ఊపిరైనప్పుడు
శత్రువులు మిత్రులు
ఖడ్గమో కరమో ఛాలన ధారులై
అమీ తుమీ తేల్చాలని శాసిస్తారు !
పలాయనం ప్రత్యామ్నాయమైతే
పరుగు పరువు
శునకమో కనకమో రూపమై
అపాయంలో ఉపాయమవుతాయి !
ప్రవాహం తప్పనప్పుడు
ఎత్తులు పల్లాలు
తల దించుకునో ఎత్తుకునో
వశమవ్వాలని పరవశిస్తాయి !
అమానుషం కాలు దువ్వుతుంటే
సమయం సందర్భం
అవాహనో అవగాహనో పొంది
అనివార్య కార్యాలవుతాయి !
జ్ఞానం జ్వలిస్తున్నప్పుడు
కాంతులు శాంతులు
వెలుగులు విలువల దీపాలై
చీకటి దారుల దివిటీలవుతాయి !

★★★

## ఒక దృశ్యం
## సాంబమూర్తి లండ

మట్టిలోంచో
మనసులోంచో
కొన్ని వాక్యాలు పుట్టుకొస్తాయి!

పచ్చని బతుకులోంచో
వెచ్చని తలపులోంచో
కొన్ని పద్యాలు ప్రవహిస్తాయి!

పిట్ట పిలుపులోంచో
చినుకు తడిలోంచో
కొన్ని పాటలు పల్లవిస్తాయి!

సుదూర తీరాల నుండి
రాత్రంతా
ఎగిరొచ్చిన అక్షరాల పక్షులు
ఉదయానికల్లా
మనసు కొమ్మల మీద వాలిపోతాయి
కళ్ళ కిటికీలు తెరిచినప్పుడల్లా
రంగురంగుల రెక్కల్ని కదిలించి
దిగులు మబ్బుల్ని చెదరగొడతాయి
అద్భుత వాక్యాల కవకువలతో
మేలుకొలుపు స్వరాలు పాడతాయి

ఎక్కడెక్కడి వాక్యాలో
వాకిట్లో ముగ్గుల్లా మెరుస్తాయి
ఎక్కడెక్కడి పద్యాలో
కమ్మని కాఫీలా పలకరిస్తాయి
ఎక్కడెక్కడి పాటలో
పెదాల మీద పరుగులు తీస్తాయి
ఇదో నిత్య కృత్యం
అక్షరాలతో నిర్మించుకున్న
అందమైన ప్రపంచ దృశ్యం!

***

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఇంత నిర్జీవమై యున్నదేమి రాత్రి
ఎంత నిశ్శబ్దమయమైనదీ నిశీథి
ఆత్మ మునిగెనో నిశ్చలధ్యానమందు
పలుకగలదేమొ నిశ్శబ్దభాషలోన

నిదురలో మున్గె వసుమతీనిలయమెల్ల
నిదురపోయెనో రేయియు నిశ్చలముగ
అంతు చిక్కని చీకటికర్థమేమి
చిత్తమందేమి కలదు నిశీథమునకు

వెలుగు దారులు తోచని తలమునందు
వర్ణరహితమౌ వింత ప్రపంచమందు
హృదయమెటకేగు మార్గమదెట్లు తెలియు
మూగవోయిన గొంతున రాగమేది

కనులు మూసి ధ్యానమ్మున మునిగినపుడు
శబ్దమన్నది లేదు యోచనలు లేవు
పురము త్రోవలతోనవసరము లేదు
గమ్యములు లేవు చేరెడు గమ్యమిదియె

దినము రాత్రియు నిత్యసంస్థితులు మనకు
పూర్ణజీవితమ్మున మహాద్భుతములివ్వి
జ్ఞానదాయకమౌ చేతనత్వమొకటి
చలనరహితమైనట్టి నిశ్చలత యొకటి

COMMENTS